## క్లుప్తంగా

### గురజాల తహసీల్దార్‌గా అశోక్ బాధ్యతల స్వీకారం



గురజాల : గురజాల తహసీల్దార్‌గా సీహెచ్ అశోక్ కుమార్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా మార్కాపురం నుంచి గురజాలకు బదిలీపై వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను పలువురు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన మీసాల దానియేలు బదిలీపై ప్రకాశం జిల్లాకు వెళ్లారు.

### ఉత్తమ ఏవోకు సత్కారం



మాచర్ల: మాచర్ల మండల వ్యవసాయాధికారిగా పనిచేస్తూ ఉత్తమ అవార్డు పొందిన కట్టా లక్ష్మారెడ్డి సేవలు అభినందనీయమని పలువురు అన్నారు. మంగళవారం పత్తి ఫ్యాక్టరీలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కుర్రి సాయిమార్కొండారెడ్డి, లయన్స్ క్లబ్‌కు చెందిన అల్లం కోటిరెడ్డి, రాంబాబుల ఆధ్వర్యంలో పలువురు సత్కరించి ఉత్తమ అవార్డు పొందినందుకు అభినందనలు తెలిపారు. ఇప్పటికే పలుసార్లు ఉత్తమ అవార్డు పొందిన కట్టా లక్ష్మారెడ్డి సేవలు అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షులు కంచర్ల లక్ష్మీరాంబాబు, కాసు అంజిరెడ్డి, ఫెర్టిలైజర్స్, ఎరువుల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

### అమ్మవారి దేవాలయంలో అన్నదానం



గురజాల : పట్టణంలో వేంచేసి యున్న పాత పాటేశ్వరి అమ్మవారి దేవాలయంలో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ కుక్కమూడి అన్నారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాచకులకు ప్రతి మంగళవారం అన్నదానం చేయడం మంచి పనని అన్నారు. స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు బాగున్నాయని అభినందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కుక్కమూడి అనిల్‌కుమార్, ఫౌండేషన్ అధ్యక్షుడు గుండా కాశీవిశ్వనాథం, కనకం హనుమంతరావు, నాగేశ్వరరావు, వై లక్ష్మయ్య తదితరులున్నారు.

### రైలు కింద పడి వృద్ధుడు మృతి



పిడుగురాళ్ల: రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన పిడుగురాళ్లలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి పిడుగురాళ్ల రైల్వే సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..న్యూ పిడుగురాళ్ల రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు తెలిపారు. అతని వయస్సు సుమారు 65 నుంచి 70 సంవత్సరాలలోపు ఉంటుందని అన్నారు. అతని ఒంటిపై నీలి రంగు స్వెట్టర్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఆచూకి తెలిసిన వారు పిడుగురాళ్ల రైల్వే సీఐను సంప్రదించాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9701379709 సంప్రదించాలని సూచించారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



పిడుగురాళ్లరూరల్: పనుల నిమిత్తం ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో గాయాలైన ఘటన మండలంలోని అంజినీపురం బైపాస్ వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వీరారెడ్డి, రామిరెడ్డి పొలం పనుల నిమిత్తం దాచేపల్లి వైపు వెళ్తుండగా గుంటూరు వైపు నుంచి దాచేపల్లి వైపు వెళ్తున్న కారు బైకును ఢీకొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వీరారెడ్డి, రామిరెడ్డిలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే టోల్‌ప్లాజా అంబులెన్స్ ద్వారా గాయపడిన వారిని పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

### పాఠశాలకు సీసీ కెమెరాలు అందజేత

అచ్చంపేట: స్థానిక తుమ్మెపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలుకు 1996–97 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం రూ.25 వేలు విలువచేసే సీసీ కెమెరాలను పాఠశాల ప్రధానోపాధ్యాయిని చిగురుపాడు కల్యాణికి అందజేశారు. వీరిని పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

# గోలివాగొస్తే రాకపోకలు బంద్



గోలివాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి



ఉధృతంగా ప్రవహిస్తున్న గోలివాగు (ఫైల్)

- అనేక మందిని కబళించిన గోలివాగు
- వేగవంతంగా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు వాహనదారులు

రెంటచింతల: మండల కేంద్రమైన రెంటచింతల గ్రామ శివారులో ఉన్న గోలివాగుపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన లోలెవల్ బ్రిడ్జి కారణంగా వర్షాకాలం వస్తే గుంటూరు–మాచర్ల మధ్య రాకపోకలు నిలిచిపోవడం ఇప్పటి వరకు పరిపాటిగా మారింది. వర్షం కురిసినప్పుడల్లా గోలివాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి మీదగా 4, 5 అడుగుల మేర వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. వాగు పొంగిన సమయంలో అనేక మంది మరణించిన ఘటనలూ ఉన్నాయి. బ్రిడ్జికి ఇరువైపుల రైలింగ్ లేకపోవడంతో బ్రిడ్జి మార్జిన్‌లు అర్థం కాకపోవడంతో వాహనాలు వాగులో పడి పలువురు గాయపడిన సందర్భాలు అనేకం చేటుచేసుకున్నాయి. మండలంలోని మంచికల్లు గ్రామ సమీపంలో ఉన్న బుగ్గవాగు రిజర్వాయర్ నుంచి వచ్చే సీపేజ్ (లీక్‌నీరు) వాటర్ కారణంగా ఈ వాగు ఏడాది పొడవునా ప్రవహిస్తుంది. బ్రిడ్జి అతితక్కువ ఎత్తులో నిర్మించడం వలన



గోలివాగుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జి తొలిగిస్తున్న పనులు

చిన్నవర్షాలకు సైతం బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తుండటంతో ఈ రహదారిపై వెళ్లే వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. 2000 ఆగస్టులో వచ్చిన తుఫాన్ కారణంగా గోలివాగు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో మాచర్లకు చెందిన సుమో వాహనం బ్రిడ్జిని దాటడానికి ప్రయత్నించగా వాహనం వరద ధాటికి కొట్టుకుపోయింది. ఈ ప్రమాదంలో 10మంది అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. లోలెవల్ బ్రిడ్జి కారణంగానే వాగు పొంగినప్పుడల్లా మరికొందరు మృతి చెందడంతో గోలివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడతానని చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రకటించి నిధులు విడుదల చేయకపోవడంతో కార్యరూపం దాల్చలేదు. ఇప్పటి వరకు ఎన్నో ప్రమాదాలకు నెలవుగా మారిన గోలివాగుపై ప్రస్తుతం మాచర్ల–దాచేపల్లి బైపాస్ రోడ్డు (ఎన్‌హెచ్–167 ఏడీ) నిర్మాణ పనులలో భాగంగా హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతుండటంతో వాహనదారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

#### గోలివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం సంతోషకరం..



గోలివాగుపై బ్రిటీష్ కాలంలో నిర్మించిన లోలెవల్ బ్రిడ్జి అనేక మందిని బలి తీసుకుంది. ప్రతి రోజు వందలాది వాహనాలు ఈ బ్రిడ్జిపై రాకపోకలు సాగిస్తున్నాయి. వాగు పొంగినప్పుడల్లా ప్రయాణికులు అనేక అగచాట్లకు గురవుతున్నారు. ప్రస్తుతం చేపట్టిన ఎన్‌హెచ్–167 ఏడీ పనలలో భాగంగా గోలివాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం చాలా సంతోషకరం.

– మద్దిరాల కృష్ణారెడ్డి, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్, రెంటచింతల

# జనం గుండెల్లో జగన్

- అన్ని పార్టీలు ఒక వైపు..జగనన్న ఒక్కడే ఒక వైపు
- జగనన్న బలం ప్రజలే
- ప్రజల తీర్పులో జగనన్నదే అంతిమ విజయం
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



గామాలపాడులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : జెండాలు జతకట్టడం ప్రతి పక్షాల పని అని..జనం గుండెల్లో ఉండటం జగనన్న నైజం అని గురజాల శాసనసభ్యుడు కాసు మహేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని గామాలపాడు ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూ.1.50 కోట్లతో నిర్మించనున్న పైపులైన్, ట్యాంక్‌లతో పాటు పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. సంక్షేమం, అభివృద్ధి పనులతో జనం గుండెల్లో గూడుకట్టుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు రాష్ట్రంలోని అన్ని పార్టీలు జతకట్టాయని, కుట్రలు, కుతంత్రాలు, ప్రజలను మోసం చేసి గెలిచేందుకు బద్ధశత్రువులైన పార్టీలన్నీ ఏకమై కొత్త తరహా కుట్ర రాజకీయాలకు తెరలేపాయని ఆయన చెప్పారు. అన్ని పార్టీలు కలిసి గుంపులు గుంపులుగా వచ్చినా..కుటుంబాన్ని నిలువునా చీల్చినా భయపడేది లేదని జగనన్న చెబుతున్నాడని, జగనన్న బలం..ధైర్యం, నమ్మకం ప్రజలేనని తెలిపారు. దేవుడి దీవెనలు, ప్రజల ఆశీస్సులు ఉన్నంత వరకు జగనన్న దారిదాపుల్లోకి ఆ పార్టీలు రావని, 175కి 175 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయదుందుభి మోగించటం తథ్యమని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం జగనన్న 124 సార్లు బటన్ నొక్కారని, జగనన్న కోసం వచ్చే ఎన్నికల్లో రెండు సార్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని ప్రజలను ఎమ్మెల్యే కాసు కోరారు. రేపు జరిగే ఎన్నికల్లో కుట్రలు, కుతంత్రాలతో ప్రతిపక్షాలు ప్రజలను మోసం చేసేందుకు వస్తారని, ఇచ్చిన మాటను ఇచ్చినట్లుగా..చెప్పినవన్నీ చేసి చూపించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మనమంతా అండగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, సర్పంచ్ జంగా సురేష్, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, ఎంపీటీసీ షేక్ ఆదాం సాహెబ్, ఉపసర్పంచ్ సయ్యద్ పెదహుస్సేన్, నాయకులు పోలే సుధీర్, సయ్యద్ రసూల్, చాపల జానీ, షేక్ హుస్సేన్, షేక్ సైదులు, చాప సాంబశివరావు, పోలే ఎర్రబ్బాయి, లెనిన్ బాబు, మేదర దానియేలు తదితరులు పాల్గొన్నారు.

## 503 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ నసీరూన్

మాచవరం: మండలంలోని పిన్నెల్లి సచివాలయం –1 పరిధిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 503 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేసినట్లు పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులకు గైనకాలజిస్టు డాక్టర్ అనూష వైద్య పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పలు సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో చిన్నపిల్లల వైద్య నిపుణులు డాక్టర్ రఘురామ్, పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నసీరూన్, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

**జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే వేగవంతం చేయాలి**



ఎంపీడీవో శంకర్‌రావు

రెంటచింతల: గ్రామాలలోని ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో పెదప్రోలు శంకర్‌రావు అన్నారు. మంగళవారం రెంటచింతలలోని సచివాలయం–3 ని ఆయన సందర్శించి సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఈ నెల 9న జరగనున్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమానికి సంబంధించి సర్వేను 8వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలలోపు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని వారి పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవాలన్నారు. గ్రామంలో ఉన్న ఫ్యామిలీ డాక్టర్ విలేజ్ క్లినిక్ ద్వారా ఆ సమస్యలను పరిష్కరించి వారికి ఉచితంగా మందులను, కళ్లద్దాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో గ్రామంలోని ఆ సచివాలయం పరిధిలో ప్రతి ఇంట్లో ఎవరికి ఎలాంటి వైద్యసహాయం కావాలో, ఏఏ మందులు అవసరమో తెలుస్తుందన్నారు.

## వేదంతో మెరుగైన వైద్య సేవలు పొందవచ్చు

**విశ్రాంత చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రమణ్యం**



రెంటచింతల వాసవి దేవస్థానంలోని కార్యక్రమంలో మాట్లాడుతున్న విశ్రాంత సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం

రెంటచింతల: ప్రజలకు వచ్చే అనేక రకాల వ్యాధుల నివారణకు వేదం ద్వారా మెరుగైన వైద్యసేవలు పొందవచ్చని రాష్ట్ర విశ్రాంత చీఫ్ సెక్రటరీ ఎల్వీ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం స్థానిక శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శ్రీ ధాత్రే నమః సేవా సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేదం ద్వారా సుమారు 60 వ్యాధుల నుంచి ఉపశమనం పొందవచ్చని తెలిపారు. అనంతరం వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులతో మాట్లాడారు. కార్యక్రమంలో చెన్నకేశవ శాస్త్రి, నాళం పెదబాబు, బొడ్డుపల్లి ప్రసాద్, మట్టపల్లి, యేచూరి కొండలు, గుండా రామ్మూర్తి, దుర్గి మార్కెట్ యార్డు డైరెక్టర్ వెన్నా వెకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఇంటి వద్దే ఓటుపై పరిశీలన

- 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగుల కోసం ఈసీ పరిశీలన
- సత్తెనపల్లి ఆర్‌డీవో మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ

సత్తెనపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశాన్ని కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలిస్తుందని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేయాలంటే 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. వైకల్యం కారణంగా శరీరం సహకరించక పోవడంతో సహాయకులు ఉంటే గానీ పోలింగ్ కేంద్రాలకు వెళ్ళలేని పరిస్థితి ఉందన్నారు. వీరి కష్టాలు గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం రాబోయే ఎన్నికల్లో ఇంటి వద్ద ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తుందన్నారు. ఇందుకు మొబైల్ ఓటింగ్ వాహనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారన్నారు. దీనికి పూర్తి స్థాయిలో విధి విధానాలు రావలసి ఉందన్నారు. ఇంటి వద్దనే మొబైల్ ఓటింగ్ ద్వారా 80 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఫారం– 12డీతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద ఉన్న బీఎల్‌ఓ ల ద్వారా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి దరఖాస్తులు అందించాలన్నారు ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్ల జాబితాలో డబల్ ఎంట్రీల అంశాన్ని ప్రస్తావించగా డబల్ ఎంట్రీలు లేకుండా చూస్తామన్నారు. పలువురి సలహాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో తహసీల్దార్లు సీహెచ్.ఉష(సత్తెనపల్లి), ఎం.లక్ష్మీనారాయణ (నకరికల్లు), మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, రాజుపాలెం డిప్యూటీ తహసీల్దార్ ఏ నళిని, ముప్పాళ్ళ డిప్యూటీ తహసీల్దార్ సీ.లక్ష్మీప్రసాద్, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ బోసు బాబు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### పాత కక్షలతో వ్యక్తిపై దాడి

రొంపిచర్ల: మండలంలోని తురిమెళ్ల గ్రామానికి చెందిన గొళ్లపూడి శ్రీనివాసరావును పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన బంధువులు గొళ్లపూడి రామారావు, గొళ్లపూడి కొండయ్య మరి కొందరు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల కథనం ప్రకారం.. శ్రీనివాసరావు బైక్‌పై నరసరావుపేట వెళ్తున్నాడు. అతడు విప్పర్లపల్లి సమీపంలోకి రాగానే రామారావు, కొండయ్య మరో ఇద్దరు ఆటోతో బైక్‌ను ఢీకొట్టారు. కింద పడ్డ అతడిని వారు కొట్టి తీవ్రంగా గాయపరిచారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ కేపీ రవీంద్ర సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. తీవ్ర గాయాలైన శ్రీనివాసరావును చికిత్స నిమిత్తం నరసరావుపేట ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాంబాబు మంగళవారం పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పలు దేవర్లపాడు, గోళ్లపాడు, కుందురువారిపాలెం, ముప్పాళ్ళ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై ఎస్సై పి.హజరతయ్యతో సమీక్షించారు. ఆయా కేంద్రాల వద్ద తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

### వైఎస్సార్ క్రాంతిపథం సీసీపై విచారణ




దమ్మాలపాడు(ముప్పాళ్ళ): మండలంలోని దమ్మాలపాడు గ్రామ సచివాలయంలో వైఎస్సార్ క్రాంతిపథం సీసీ నాగమల్లేశ్వరరావుపై మంగళవారం విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన మూడు డ్వాక్రా గ్రూపులకు సంబంధించి లావాదేవీల్లో అక్రమాలు జరిగాయంటూ వీఓఏ ఎల్.జానకీరాణి జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. మూడు డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన స్త్రీనిధి చెల్లింపులను బ్యాంకుకు జమ చేయకుండా అవకతవకలకు పాల్పడి గ్రూపు సభ్యులను మల్లేశ్వరరావు ఇబ్బందులకు గురి చేస్తున్నాడంటూ స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దమ్మాలపాడు గ్రామ సచివాలయంలో జరిగిన విచారణకు స్త్రీ నిధి జిల్లా ఏజీఎమ్ చిన్నబుల్లయ్య, లీగల్ కోఆర్డినేటర్ కనకారావులు హాజరై సంబంధిత గ్రూపు సభ్యుల నుంచి వివరాలు నమోదు చేసుకొన్నారు. ఏపీఎం బాలస్వామి తదితరులు ఉన్నారు.

### అక్రమ మద్యం కేసులో..

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసి ఆమె వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సీఐ నయనతార మంగళవారం తెలిపారు. నాదెండ్ల మండలం కనపర్రు గ్రామానికి చెందిన చెవుల నారాయణమ్మ అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టణ శివారు ఎస్ఆర్‌కేటీ కాలనీ వద్ద పట్టుబడిందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితురాలిని కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

### ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌లు వేగవంతం చేయాలి



సచివాలయంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న జేసీ

ముప్పాళ్ళ: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందించిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రకియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని మాదల గ్రామ సచివాలయంలో జరుగుతున్న ఎస్‌పీఐ రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన రిజిస్ట్రేషన్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం ఉచితంగా గ్రామ సచివాలయాల ద్వారా లబ్ధిదారులకు అందించిన ఇంటి పట్టాను రిజిస్ట్రేషన్ చేయించి హక్కు పత్రం అందించటం జరుగుతుందన్నారు. ఇంటి పట్టాల లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీవో వి.మురళీకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాదు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు

పిడుగురాళ్ల: రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరు పాటించాలని పిడుగురాళ్ల మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివనాగేశ్వరరావు తెలిపారు. పట్టణ సమీపంలోని కొండమోడు వద్ద కేఎస్‌ఆర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిడుగురాళ్ల ఎంవీఐ శివనాగేశ్వరరావు మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా కళాశాల విద్యార్థులకు రోడ్డుపై ప్రయాణించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలను నడపాలని సూచించారు. నేటి ప్రపంచంలో ఫోన్ ఎంత ఉపయోగమో, అంత ప్రమాదకరంగా మారిందని, ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం ప్రాణాలకే ప్రమాదమని, ఇది గ్రహించి వాహనాలను నడపాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదకరమని యువత కచ్చితంగా తెలుసుకొని జాగ్రత్తలు పాటించాలని, మద్యం సేవించటం ఆరోగ్యానికి హానికరమని సూచించారు. రోడ్డు ప్రమాదాలలో చిన్న చిన్న గాయాలకే ప్రాణాలను కోల్పోవాల్సి వస్తుందని, అందుకే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు జాగ్రత్తలను పాటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. స్వల్ప నిర్లక్ష్యం వలన ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని, అందుకే ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలను అరికట్టవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు, ఆర్‌టీఐ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనుల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి ధనుంజయ

మాచర్ల: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి జన్ మన్ కార్యాచరణలో భాగంగా వివిధ పథకాల గురించి ప్రతి గ్రామంలో వివరించాలని శ్రీశైలం ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి బి.సి.ధనుంజయ అన్నారు. మంగళవారం పట్టణ మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో ఐటీడీఏ ఆధ్వర్యంలో పీఎం జన్ మన్ కార్యాచరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అందరికీ పక్కా ఇళ్లు, మంచినీటి పైపులైన్, గ్రామాలకు రహదారుల నిర్మాణం, ప్రతి ఇంటికి సోలార్ ద్వారా విద్యుత్ సరఫరా, అందరికీ నాణ్యమైన విద్య, నైపుణ్య వికాసం, అందరికీ ఆరోగ్యం, పౌష్టికాహారం, జీవనోపాధిని మెరుగుపరచటం, ఉచిత వంట గ్యాస్, ఆయుష్మాన్ భారత్‌తో పాటు అనేక పథకాలను గిరిజనులకు మంజూరు చేయాలని సూచిస్తూ ఈ పథకం చేపట్టినట్లు ధనుంజయ చెప్పారు. కార్యక్రమంలో పలువురు రెవెన్యూ, వ్యవసాయశాఖాధికారులు పాల్గొనగా వారందరికీ పథకం గురించి అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ గుండాల నాయక్, స్పెషలాఫీసర్ గబ్రూ నాయక్‌లు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏ జగదీష్‌రెడ్డి, ఏవో కట్టా లక్ష్మారెడ్డితోపాటు మున్సిపల్ అధికారులు, వివిధ మండలాల తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవాలాల్ మహరాజ్ జయంతి కరపత్రాల ఆవిష్కరణ



సేవాలాల్ మహరాజ్ జయంతి కర పత్రాలను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ మల్లుస్వామి

విజయపురిసౌత్: ఈ నెల 17వ తేదీన విజయపురిసౌత్‌లోని సేవాలాల్ కీమాలల్ జంక్షన్ వద్ద శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కె.పాండునాయక్ మంగళవారం తెలిపారు. సేవాలాల్ మహరాజ్ జయంతి కరపత్రాలను మాచర్ల జెడ్పీటీసీ మల్లు స్వామి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఆలయ ధర్మకర్త పాండునాయక్ మాట్లాడుతూ సేవలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అపోలో రిచ్ హాస్పిటల్ మిర్యాలగూడ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో గుండె పరీక్షలతో పాటు ఐదు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు చెప్పారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కేపీ గూడెం సర్పంచ్ కె.పాండునాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బ్రహ్మనాయక్, అపోలో హాస్పిటల్ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రవీందర్, పాండునాయక్, ఆలయ పూజారి శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

రాజుపాలెం: పులిచింతల ప్రాజెక్టు పునరావాస కేంద్రాలలో నిర్వాసితుల ఇళ్ల పట్టాల ఉచిత రిజిస్ట్రేషన్‌లపై ఎల్లో మీడియా, టీడీపీ కార్యకర్తలు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని రాజుపాలెం పునరావాస కేంద్ర జీడీసీఎంఎస్ డైరెక్టర్ పొలవాయి ఆదినారాయణ మండిపడ్డారు. డబ్బులు వసూలు చేస్తున్నారని ఒక పత్రిక (సాక్షి కాదు) రాయడాన్ని తీవ్రంగా ఖండించారు. మండలంలో మూడు పునరావాస కేంద్రాలలో 1,893 ప్లాట్లు ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 100 మందికి పైసా తీసుకోకుండా రిజిస్ట్రేషన్‌లు చేయడం జరిగిందని తెలిపారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు డబ్బులు తీసుకుంటున్నారని టీడీపీ నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తూ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆపాలనే దురుద్దేశంతో ఉన్నారని దుయ్యబట్టారు.